


అప్పటివరకు భర్త రాకకోసం ఎదురు చూస్తూ హాల్లోనే కూర్చున్న ప్రజ్ఞ గోడగడియారం తన కర్తవ్యాన్ని నిర్వహిస్తూ ఏడు గంటలు కొట్టగానే సన్నగా నిట్టూర్చింది.

ఇలాంటి తియ్యని కలలు మధ్యతరగతి ప్రజలకు ఎక్కువగా వస్తాయంటారు. ఇది కలేనా కావచ్చును. లేదా ఆశ అయినా కావచ్చును.



"ఈ రోజుకు సిన్మాకెళ్ళే అవకాశం చేజారిపోయింది. ఉదయం ఆఫీసుకెళ్లేటప్పుడు పిక్చరు ప్రోగ్రాం ఉందన్న విషయం మరీ మరీ భర్తకు గుర్తు చేసింది. అయినా రాలేదంటే నిజంగా ఈ మగాళ్ళు....." ప్రజ్ఞలో ఎదురుచూపులు కోపంగా రూపాంతరం చెందేవేళ, గడియారం మరో అర్ధ గంట ముందుక్కొలిచాక అదిగో అప్పుడు ఇంటికొచ్చేడు శ్రీహర్ష.

లోపలికొస్తూనే "సారీ డియర్" అని మాత్రం అనలేదు. హుస్సురని నిట్టూరుస్తూ సోఫాలో కూర్చుబోతుంటే ప్రజ్ఞ విసురుగా లేచి లోపలికి వెళ్లిపోయింది. మరొకప్పుడయితే ఆమెకు బాగా కోపం వచ్చిందని తెలియగానే "ఓ గాడ్ సేవ్ మి" అని రెండు చేతులెత్తి ప్రార్థించేవాడేమో గాని ఇప్పుడవేవీ పట్టించుకునే మూడ్‌లో లేదు.

ఈరోజు అతడి మనసంతా సంతోషంతో నిండిపోయింది. కళ్లు మూసినా తెరిచినా తానంతకు ముందే చూసొచ్చిన రెండు పోర్షన్ల బోడి డాబాయిల్లే కళ్లలో కన్పిస్తోంది. ఇంటి ముందు కాంపస్ నానుకుని వీరసైనికుల్లా పెరిగిన నాలుగు అశోక వృక్షాలు, దక్షిణంవైపు ఏపుగా ఎదిగిన కొబ్బరి, అరటిచెట్లు, ఉత్తరంవైపు మొక్కలు పెంచుకోటానికి అనువుగా మిగిల్చిన కొద్దిపాటి ఖాళీ జాగా అంతా సిన్మా రీలులా కళ్లముందు కదుల్తోంది. అన్ని సౌకర్యాలతో ఉన్న అంత అందమైన ఇల్లు



**దెయ్యాలకథలపోటీలో సాధారణప్రచురణకు ఎంపికైన కథ**

చాలా తక్కువలో లభించబోతుందంటే నమ్మబుద్ధికావడంలేదు.

అయినా చచ్చినట్టు నమ్మి తీరాల్సిందే. స్వయంగా ఇల్లు అమ్మదల్చుకున్న యజమాని కేశవరావుగారే రేటు విషయం తనతో చెప్పేక నమ్మకుండా ఎలా ఉండేది.

"సారీ డియర్. ఈవేళ ఆఫీసులో పనెక్కువగా ఉంది. అందుకే నిన్ను పిక్చరుకు తీసికెళ్ళలేకపోయాను. రేపు తప్పకుండా వెడదాం. మాఫ్‌కీజీయే" అని తన వెనకే వచ్చి బతిమాలాడి, అవసరమయితే రెండు చేతులు జోడించి ప్రసన్నంచేసుకునే భర్త లోపలికి వచ్చే జాడే కన్పించకపోడంతో మళ్ళీ విసురుగా గుమ్మం వరకు వచ్చి హాల్లోకి తొంగిచూసింది ప్రజ్ఞ.

సోఫాలో డ్రీమ్స్‌లో తేలిపోతున్నట్టు కూర్చున్న భర్తను చూడగానే దండతాడిత అయ్యింది. వచ్చినంత వేగంగానే వెళ్ళిపోబోతుంటే "ప్రజ్ఞా డియర్ నీకో గుడ్ న్యూస్ నా మాట విన్పించుకోకుండా వెళ్ళేవో గోల్డెన్ ఛాన్స్ మిస్సయ్యావన్న మాటే" ఇటు తిరక్కుండానే అన్నాడు.

"మీరు నాకేం చెప్పక్కర్లేదు.ఉదయం ఆఫీసుకువెళ్ళేముందు మీతో ఏం చెప్పానో గుర్తుందా" అడిగింది సీరియస్‌గా.

"నువ్వు చెప్పింది మర్చిపోయే సాహసం ఈ భార్యావ్రతునికి ఉందా డియర్. నీ మాట తుచతప్పకుండా ఐదింటికే బయల్దేరి వస్తుంటే ఓ ఫ్రెండ్ కన్పించి "అమ్మకానికి ఇల్లు ఇందిరా కాలనీవైపు రెడీగా ఉందట చూస్తావా" అన్నాడు. అంతే సిన్మాకంటే ఇల్లు చూడ్డం ముఖ్యంగదా అని అతగాడితో వెళ్లాను.

ఇల్లు మాటెత్తగానే ప్రజ్ఞలో కోపం మంచులా కరిగిపోయింది. ఒక అంగలో వచ్చి భర్త ప్రక్కనే కూర్చుని "ఇల్లు చూశారా? ఎలా ఉంది? ఎన్ని గదులున్నాయి? డాబాయిల్లా, పెంకుటిల్లా? ఇంటి ముందయినా, వెనకయినా పూలమొక్కలు పెంచటానికి ఖాళీ జాగా ఉందా?" అంటూ ప్రశ్నల వర్షం కురిపించింది.

"ఆపు డియర్. ఊపిరి సలుపనివ్వకుండా అన్ని ప్రశ్నలు ఒకే సారడిగితే ఎలా. ముచ్చటగా రెండు పోర్షన్లుగా, నాలుగ్గదుల్తో కట్టిన డాబా ఇల్లు. స్లాబ్ వేశారుగాని మెట్లు కట్టించలేదు. మనమే కట్టించుకోవాలి. ఇంటి ముందర ఖాళీ స్థలం ఉంది. అన్ని ఫెసిలిటీస్ ఉన్నాయి. ఒక్కముక్కలో చెప్పాలంటే మనం సొంతిల్లు ఎలా ఉండాలని ప్లాన్ చేసుకుని కలలు కనేవాళ్లమో ఆ కలల రూపంలో ఉందా ఇల్లు" చెప్పాడు శ్రీహర్ష.

"ఇంతకీ రేటెంతో చెప్పలేదు."

"డెబ్బయి అయిదువేలు చెప్పాడు. మనం కాదూ కూడదంటే ఏభయి, అరవయి మధ్య బేరం సెటలవ్వొచ్చు" అన్నాడు శ్రీహర్ష.

"మీరు నాతో జోక్ చేస్తున్నారా?" ప్రజ్ఞ తీవ్రంగా అంది.

"జోక్ కాదు ప్రజ్ఞా నేను చెప్పేది నిజమే."

"నాలుగ్గదులున్న డాబా ఇల్లు, అందులోను అన్ని సౌకర్యాలతో ఉన్నది ఈ పట్టణంలో, ఎవరండీ బాబు మీకంత చవగ్గా అమ్మేసే అమాయకుడు" ఎగతాళిగా అంది.

"నేనూ నీలాగే ఆశ్చర్యపోయాను ప్రజ్ఞా. ఈ ఏరియాలో ఎంత తక్కువలో చూసినా అటువంటి ఇల్లు కొనాలంటే లక్షకు పైనే అవుతుంది. అంత చవగ్గా ఎందుకు అమ్మేస్తున్నారో నాకు అర్థం కాలేదు" అన్నాడు సాలోచనగా.

"అర్థం కాకపోటానికి ఇదేం అతర్జాతీయ సమస్యకాదు లెండి. అది అచ్చిరాని కొంపో, దయ్యాల కొంపో అయ్యుంటుంది" ఇట్టే తేల్చేసింది.ఇలాంటి సమయాల్లోనే ఆడవారి బుర్రకు హాట్సాఫ్ చెయ్యాలనిపిస్తుంది శ్రీహర్షకు.

"దయ్యాల కొంపయితే పరవాలేదు గాని, అచ్చిరాని కొంపయితే కాస్త ఆలోచించాలి" అన్న భర్త మాటలకు చురచుర చూసి "దయ్యాల్తో సహవాసమంటే మీకు

ఇష్టమైన స్వీటు తిన్నంత అనుభూతి కలుగుతున్నట్టుందే" అంది వ్యంగ్యంగా.

"అదికాదు ప్రజ్ఞా నా అభిప్రాయ మేమిటంటే అన్ని దయ్యాలు మనుషు లకు ఉపకారం చేయవు. కొన్ని ఉపకారం చేసేవి ఉంటాయి, కొన్ని చిలిపి దయ్యాలు ఉంటాయి. నిజంగా ఆ ఇల్లు దయ్యాలుం డేదే అనుకో అప్పుడు దయ్యాల గురించి మనకు తెలియని విషయాలెన్నో తెలుసు కునే అవకాశం ఉంటుంది గదా" అన్నాడు.

"ఏమో బాబు. దయ్యాల మధ్య కాపురమంటే మీకు థ్రిల్లింగుగా ఉందేమో గాని నాకా మాటలు తల్చుకుంటేనే గుండె దడ మొదలవుతుంది. ఆ దయ్యాల్తో కష్టాలు పడేకంటే అద్దె ఇంటితో పాట్లే ఎన్నో రెట్లు నయం. ఆ ఇంటికో నమ స్కారం" అంటూ ప్రజ్ఞ వెళ్ళిపోబో తుంటే ఆమె చెయ్యిపట్టుకుని ఆపేస్తూ "అలా మధ్యలో వెళ్ళిపోకు. ఒకసారి నువ్వు కూడా ఆ ఇల్లు చూస్తే బావుం టుంది. అంతగా నీకిష్టం లేదంటే కొనడం మానేద్దాం" అన్నాడు.

"సరే. రేపు ఓ పూట సి.యల్. పెట్టండి ఇద్దరం వెళ్లి చూద్దాం" అంది.

"ఓ.కే." హుషారుగా ఈలవేశాడు శ్రీహర్ష.

* * * * * *

ఇల్లు చూశాక ప్రజ్ఞ భయాలన్నీ ఓ మూలకు నెట్టేసింది. తమకు అందు బాటులో తామూహించుకున్న రీతిలో ముద్దుగా ఉన్న ఆ ఇల్లు చూశాక దానికి వంకపెట్టాలనిపించలేదు. అయినా అను మానం తీరక "ఈ ఇల్లు మీరు ఎందుకు అమ్మెయ్యాలనుకుంటున్నారు?" అని అడి గింది కేశవరావుని.

"మా ఇంట్లో సభ్యులెక్కువ. ఈ ఇల్లు సరిపోక శాంతినగర్‌వైపు పెద్ద ఇల్లు అమ్మకానికొస్తే అగ్రిమెంటు రాసుకోటం జరిగింది. ఈ ఇల్లు అమ్మేసి ఆ ఇల్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్న అభిప్రాయంతో దీన్ని అమ్మకానికి పెట్టాం" చెప్పేడు.

ఇక ఆలోచిస్తూ ఆలకించడం మంచి దికాదనిపించింది. ఓ రెండు వేలు అడ్వా న్సిచ్చి అగ్రిమెంటు రాయించేసుకున్నాడు శ్రీహర్ష. "రెండు నెలల్లో రిజిస్ట్రే షన్ జరిగిపోవాలని" కేశవరావు మరీ మరీ చెప్పాడు.



## మాధురి చిందులు

'రామ్ లఖన్' చిత్రంలో నటించిన మాధురీ దీక్షిత్ తనను 'సౌదాగర్'లో బుక్ చేసుకో లేదని సుభాష్‌ఘయ్ మీద చిందులు తొక్కుతోందట. ఇటీవల ఒక విందులో కలుసుకున్నప్పుడు ఈ విషయాన్ని ఘయ్ చెవిలో వూదింది మాధురి. క్రొత్త వాళ్ళకు నేను అవకాశం యివ్వకపోతే ఎవరిస్తారు? అని వూరుకుంటే బాగుండేది. రామ్‌లఖన్‌లో మాధురిని బుక్ చేస్తుంటే పాతవాళ్ళు మాకు అవకాశం యివ్వరేంటి అని అడిగారని కూడా అన్నాడట. అంతే మాధురికి ఒళ్ళు మండిపోయి చిందులు తొక్కిందట.

ఉన్న బ్యాంకు బాలెన్సుకు తోడు ఆఫీసులో అన్ని రకాల లోన్స్ పెట్టి ఇంకా కొంత ఎమౌంటు తక్కువొస్తే భార్య నగలు తాకట్టు పెట్టి రెండు నెలల్లో ఇల్లు తనదనిపించుకున్నాడు శ్రీహర్ష.

గృహప్రవేశం ఆడంబరంగా జరిపించా లని ప్రజ్ఞపట్టుబట్టింది. ఆర్థిక పరిస్థి తుల దృష్ట్యా అతడికిష్టంలేకపోయినా భార్య ముచ్చటను తోసిపుచ్చలేకపోయాడు. ఆ ముచ్చట తీర్చటం కోసం మామ గారి ముందు ఐదువేలకు చేయి చాచా ల్సొచ్చింది.

ఇంటికి పింక్ కలర్ డిస్టెంపరు, కిటి కీలకు, గుమ్మాలకు లైట్ కలర్లో రంగులు వేయించాడు. మంచి ముహూర్తం చూపించి అట్టహాసంగా గృహప్రవేశం చేశాడు శ్రీహర్ష. వనిలో వనిగా సత్యనారాయణ వ్రతం జరి పించడం మర్చిపోలేదు.

మధ్యాహ్నం విందు భోజనం, అనం తరం కొంతమంది బంధువులకు ముఖ్య స్నేహితులను వీడ్కోలు పలికాక భార్యాభర్త లిరువురు హుస్సురని నిట్టూర్చుతూ గదిలో ఫేన్ కిందకు చేరారు.

"ఈ శుభ కార్యం కాస్తా ఎలా గట్టెక్కుతుందోనని భయపడ్డానుగాని చాలా చక్కగా జరిగింది" ప్రజ్ఞ సంతృప్తిగా అంది.

"నిజమేగాని ఈ గృహప్రవేశం మాటెలా ఉన్నా నా పని మాత్రం అయిపోయింది. జేబులు ఖాళీయే. ఒంటో ఓపికా ఖాళీయే" నీరసంగా గోడకు చేరబడిపో యాడు శ్రీహర్ష.

"అటువంటి ఇబ్బందులన్నీ లేకుండా ఓ ఇంటి యజమాని ఎలా అవుతాము సుకున్నారు. సొంత ఇల్లు లభించిందన్న తృప్తి ముందు ఆ సాధక బాధకాలన్నీ అల్పమైనవే" అంది ప్రజ్ఞ.

ఇంతలోనే ప్రజ్ఞ తమ్ముడు మధు అక్కడికొస్తూ "బావగారూ అద్దె ఇంటి నుండి సామాను మొత్తం వేన్‌లో వేయించి తీసుకొచ్చేశాను. ఇల్లు ఖాళీ చేసి ఇంటిగలవారికి అప్పగించేశాం. వేన్‌లో సామాను ఎక్కడ పెట్టించమంటారు?" అడిగాడు.

"పక్కనున్న రెండు గదులు ఖాళీ యేగా. ఆ గదుల్లో పెట్టించు. ఇక ఈ రోజుకు సామాను సర్దుకునే ఓపిక మా ఇద్దరికీ లేదు. రేపు చూసుకుందాం" అన్నాడు శ్రీహర్ష.

"అలాగే" అంటూ మధు బయట కెళ్లి పనివాళ్లచేత సామాను మోయించి పక్కనున్న గదుల్లో పెట్టించాడు.

వెళ్లిపోగా మిగిలిన బంధువులు, ప్రజ్ఞ, శ్రీహర్షలు ఉన్నరెండు ఖాళీ గదుల్లోనే పక్కలు పరుచుకుని సర్దుకు పడుకున్నారు.

గృహప్రవేశ వేడుక పుణ్యమా అని వారం రోజులుగా సరయిన నిద్రలేక పోవడం, ఆ రోజంతా వనితో కలిగిన అలసటవల్ల పడకమీద వాలగానే చల్లగా నిద్రాదేవి తన కౌగిట్లోకి తీసుకుంది.

ఉదయం నిద్రలేచాక స్నానాదికాలు ముగించి "ప్రజ్ఞ వంటవని తర్వాత చూసు కోవచ్చు. ఏ సామాను ఎక్కడ సర్దించాలో నువ్వు డైరెక్షన్ ఇస్తే మధు నేను కలిసి సర్దేస్తాం. రేపు మళ్లీ ఆఫీసుకు వెడితే ఇంటి గురించి పట్టించుకునే తీరికుండదు" అన్నాడు శ్రీహర్ష.

"నిజమే. వదండి వస్తున్నా" అంటూ వంటింటి పని వాళ్ల అమ్మకు అప్పగించి పక్కగదివైపొచ్చి తలుపుగడియ తీసి తెరిచి చూసిన ప్రజ్ఞ కెవ్వు మంది. ఆమె కేక వింటూనే మధు, శ్రీహర్షలు "ఏం జరిగిందంటూ" అక్కడకు పరుగె త్తుకొచ్చేరు.

గది సర్ది ఉన్న తీరు చూసి ముగ్గురూ షాక్ తిన్నారు. "మధూ నిన్న నువ్వు సామాను గదిలో సర్దించేశావా?" అను మానం తీరక అడిగాడు శ్రీహర్ష.

ఓ పక్కగా జరిపినట్టున్న మంచం, దానిమీద పరుపు, పరిచిన బెడ్‌షీటు, దక్షిణంవైపు గోడకు చేర్చిన రెండు బీరువాలు, ఓ మూలగా పెట్టిన టి.వి. స్టాండ్, దానిమీద టి.వి., మరో వైపు గోడకు చేర్చిన సోఫా ఇవన్నీ చూసి మధు తెల్లబోతూనే "సర్దించలేదండీ. అక్కడెలా ప్యాక్‌చేసి తెచ్చామో అలాగే పెట్టించాను" జరిగింది ఊహించే ప్రయత్నం చేస్తూ అన్నాడు.

ఇంకా అనుమానం తీరక రెండో గది వైపు వెళ్లారు. ఆ గదిలోనూ అంతే. గది మధ్యలో అడ్డదిడ్డంగా పెట్టించిన డైనింగ్ టేబుల్, కుర్చీలు, ఓ పక్కకు నీట్‌గా జరిపి ఉన్నాయి. టేబుల్ ప్రక్కనే స్టూలు మీద వాటర్ ఫిల్టర్, మరో వైపు చిన్న బల్ల మీద మిక్సర్ పెట్టి ఉన్నాయి. కప్ బోర్డులో గాజు సామాను, పింగాణీ సామాను, లెమన్ సెట్ అన్నీ నీట్‌గా సర్ది ఉన్నాయి.

"ఏమిటండీ ఇదంతా మాయలా గుందే" భయంగా భర్త వెనక్కు చేరుతూ అంది ప్రజ్ఞ.

"అవును బావగారూ చూస్తుంటే ఇదంతా ఇంద్రజాలంలా ఉంది. ఏదో అను

# మంచి మిత్రులు

మానంగా కూడా ఉంది" మధు కూడా అక్కమాటను బలపరిచాడు.

"మాయాలేదు మంత్రం లేదు. రాత్రి మనం నిద్రపోయాక మీనాన్న, మానాన్న పెద్దతనం వల్ల నిద్రపట్టక "పిల్లలు అలిసిపోయారు. ఈపాటి సాయమన్నా చేయకపోతే ఎలా" అని కూడ బలుక్కుని ఇవన్నీ చక్కగా సర్ది ఉంటారు. ఆ విధంగా మనకు శ్రమలేకుండా చేశారు అంటూ సర్ది చెప్పి ఇద్దర్నీ బయటకు లాక్కొచ్చాడు శ్రీహర్ష.

ప్రజ్ఞ భర్త చెప్పింది నిజమో కాదో తండ్రినిగాని, మామగారినిగాని అడిగి తెలుసుకునే ప్రయత్నం చేయలేదు. వాళ్లు "మేం కాదంటే"బయల్దేరే మెంటల్ టార్చర్‌ను తట్టుకోటం కష్టం కాబట్టి మవునంగా ఊరుకుంది.

రెండురోజులుండి బంధువులంతా ఎవరింటికి వారు ప్రయాణమయ్యారు. మధునయినా ఓ వారం రోజులుండమని ప్రాధేయపడింది ప్రజ్ఞ. "తనకేదో ఇంటర్వ్యూ ఉందని, ఉండడానికి కుదరదని" చెప్పి మధు కూడా తల్లి దండ్రులతో పాటు వెళ్లిపోయాడు.

అంతా వెళ్ళిపోయాక దిగులుగా అనిపించింది ప్రజ్ఞకు. భర్త ఉదయం ఆఫీసుకు వెళ్లేటప్పుడు "నాకు ఒంటరిగా ఇంట్లో ఉండాలంటే భయంగా ఉందండీ" అంది దిగులుగా.

"భయం దేనికి. అయినా కొత్త కాబట్టి అలాగే ఉంటుంది. నాల్రోజులు పోతే అలవాటయిపోతుంది. అంతగా నీకు ఒంటరిగా దిగులుగా ఉంటే నేనొచ్చే వరకు బయటవరండాలో కుర్చీ వేసుక్కూర్చో" అని సలహా ఇచ్చాడు.

ప్రజ్ఞ మవునంగా తలూపింది.

* * * * * * *

పక్క గదిలో ఏదో చప్పుడవడంతో హఠాత్తుగా మెలకువొచ్చింది ప్రజ్ఞకు. తెలివొచ్చేక్కూడా ఆ శబ్దాలు వినిపిస్తూనే ఉన్నాయి. గుండెలు దడదడలాడాయి. లేచే సాహసం లేనట్టు కళ్లు గట్టిగా మూసుకొని భర్తను హత్తుకుపోయినట్టు పడుకుంది.

చెవులు మాత్రం తమ కర్తవ్యాన్ని ఆపలేదు. డైనింగ్ రూమ్‌లో ఎవరో కుర్చీ జరుపుతున్న చప్పుడు స్పష్టంగా వినిపిస్తోంది.


రు. 1000/-ల బహుమతులు గెలవండి!



ద్రౌపది వ్యాసరచన పోటీ

వ్యాసాలలో ఉత్తమమైన వాటికి 1) బ్రీఫ్‌కేసు 2) చిన్నకామెరా 3) గోడగడియారం 4) ట్రాన్సిస్టర్ రేడియో, మరికొన్ని చిన్న బహుమతులు ఉంటాయి!

ప్రయాగ రామకృష్ణ సీరియల్ 'ద్రౌపది' వ్యాసరచన పోటీ-1 (9-2-'90, 16-2-'90 సంచికలలో), వ్యాసరచన పోటీ-2 (23-2-'90, 2-3-'90 సంచికలలో) ప్రకటించిన విధముగా నాలుగు ప్రశ్నలు చదివి వెంటనే ఏ రెండు ప్రశ్నలకైనా జవాబు వ్రాసి కూపన్ నెంబర్-1 కూపన్ నెంబర్-2 రెండు జత చేసి ద్రౌపది వ్యాసరచన పోటీ, ఎడిటర్ , ఆంధ్రసచిత్రవారపత్రిక, గాంధీనగరం, విజయవాడ-3కి **5-7-'90** తేదీ లోపల చేరేలా పంపండి. ఇతర వివరాలకు **6-4-'90** సంచిక తిరగేయండి.

బహుమతుల సమర్పణ, నాగేశ్వరి పబ్లికేషన్స్, విజయవాడ-2 వారు-

ఎడిటర్

ఇక ఉండబట్టలేక భర్తను నిద్రలేపింది.

"ఏమిటి ఏదన్నా కలొచ్చిందా?" అడిగాడు మత్తుగా ఆవలిస్తూ.

"హుష్! నెమ్మది. డైనింగ్ రూమ్‌లో నుండి ఏదో చప్పుడు విన్పిస్తోంది జాగర్తగా వినండి" అంది గుసగుసగా.

ఆ దెబ్బతో శ్రీహర్ష మత్తొదిలిపోయింది. ఆ చప్పుడు అతడికీ విన్పించింది. నెమ్మదిగా పడకమీద నుండి లేవబోతుంటే చెయ్యి పట్టి ఆపేసి "ఎక్కడికి?" అంది ప్రజ్ఞ.

"వెళ్లి చూస్తాను"

"అమ్మో వద్దు" బెదిరిపోతూ అంది.

"పరవాలేదు ప్రతిదానికీ భయపడకూడదు" అంటూ పిల్లిలా అడుగులేసుకుంటూ వెళ్లి ఓరగా వేసి ఉన్న తలుపు సందులో నుండి గదిలోకి తొంగి చూశాడు.

ఆ గదిలో అవసరంలేక దూరంగా పెట్టిన రెండు కుర్చీలు డైనింగ్ టేబుల్ దగ్గరగా లాగినట్టున్నాయి. లోపల ఎవరో అటుఇటు తిరుగుతున్నట్టు అడుగుల చప్పుళ్లు. సామాను కదుపుతున్నట్టు వింత వింత శబ్దాలు విన్పిస్తున్నాయి.

అంతలోనే చల్లగా తన్నెవరో తాకుతూ పక్కనుండే వెళ్లినట్టయింది. ఒక్కసారి ఒళ్లు జలదరించింది. మెల్లగా వెనక్కు వచ్చి భార్య పక్కనే పడకమీద వాలాడు.

"అంతసేపు నిలబడి చూశారు ఏదన్నా కన్పించిందా?" అడిగింది కుతూహలంగా ప్రజ్ఞ.

"ఏమీ కన్పించలేదుగాని నువ్వు భయపడినంతా అయ్యింది. మనకీ ఇంట్లో మన క్షేమాన్ని కోరే మంచిమిత్రులు మనకు తోడుగా ఉన్నారు" అన్నాడు కాస్త బిగ్గరగానే.

"అంటే..."నాలుక తడారిపోయింది ప్రజ్ఞకు.

"అనవసరంగా భయపడకు. వాటి జోలికి మనం వెళ్ళనంతవరకు అవి మననేమీ చేయవు. రెండు గదుల్లో సామాను పొందిగ్గా సర్దిన రోజే తెల్సిందిగా అవి ఉపకారం చేసేవేగాని కీడు తలపెట్టేవి కావని" అన్నాడు.

"అలా అని ఈ దయ్యాల కొంపలోనే కాపురం చేద్దామంటారా?" తీవ్రంగా అడిగింది.

"హుష్! అలా ఆవేశం తెచ్చుకోకు. మన మిత్రులకు కోపం రాగలదు. ఇంత రాత్రివేళ మనిద్దరికీ వాదులాటెందుగ్గాని

## మంచి మిత్రులు

హాయిగా నిద్రపో. ఉదయం మాట్లాడుకుందాం" అంటూ ఆమెకు అభిముఖంగా తిరిగిపోయాడు.

"హాయిగా నిద్రపోయే అదృష్టముందా మనబతుక్కి" సన్నగా గొణిగింది ప్రజ్ఞ.

మధ్యమధ్యలో ఆ చప్పుళ్ళు విన్పిస్తుండగానే ఎప్పటికో నిద్రలోకి జారింది ప్రజ్ఞ.

* * * * *

సాయంత్రం భర్త ఆఫీసునుండి రాగానే "మనకీ ఇల్లు అమ్మిన కేశవరావుని కలుసుకొన్నారా? అతడేమన్నాడు?" ప్రజ్ఞ ఆతృతగా అడిగింది.

"ఏమంటాడు ఈ ఇంట్లో దయ్యాలున్నాయన్న విషయం వాళ్లకూ తెలుసట. అది తెలిశాకే అద్దె ఇంటికి మకాం మార్చి ఈ ఇల్లు బేరం పెట్టేడట."

"ఎంత మోసం! ఈ దయ్యాల కొంపను అంటగట్టడానికి మనలాంటి అమాయకులే దొరికారా" ఎర్రబడ్డ కళ్లతో ఆవేశంగా అంది.

"ఆమాటకు అతడేమన్నాడోతెలుసా? చవగ్గా ఇల్లు అమ్ముతున్నప్పుడే మీరాలోచించాల్సింది మేష్టారూ. ఇందులో నా తప్పేముంది. నాలాగే మీరూ ఇల్లు అమ్మే ప్రయత్నం చేయండి ఎవరో ఒకరు దొరక్కపోరు అని ఓ ఉచిత సలహా కూడా ఇచ్చాడు" చెప్పేడు శ్రీహర్ష.

"అంతకు మించి చేసేదేముంది. ఓ పదివేలు తక్కువకయినా సరే ఇచ్చేసి పీడ వదుల్చుకుందాం. అంతవరకు నాకు మనశ్శాంతి లేదు" అంది ప్రజ్ఞ.

"అంత తేలిగ్గా ఈ పీడ వదుల్తుందనుకోను. మనలాంటి బుర్ర తక్కువ వాళ్లు మనకు దొరకద్దూ" అన్నాడు శ్రీహర్ష.

"ఇంతకీ ఈ దయ్యాలకథేమిటో అడిగి తెల్సుకున్నారా?" ప్రజ్ఞ కుతూహలంగా అడిగింది.

"తెల్సుకున్నాను. పాపం! అదొక విషాదగాథ. మనలాగే సొంత కొంప ఏర్పాటు చేసుకోవాలన్న ఉబలాటంతో ఓ చిరుద్యోగి ఎంతో కష్టపడి ఈ ఇల్లు కట్టించుకున్నాడట. ఆడంబరంగా గృహప్రవేశమూ చేశాడట. పట్టుమని పదినెల్లు గడిచాయోలేదో ఓ దుర్ముహూర్తానా భార్యాభర్తలు, ఇద్దరు బిడ్డల్తో కలిసి డైనింగ్ రూమ్‌లో భోజనాలు చేస్తుండగా పిడుగు పడి స్పాట్‌లో నలుగురూ పోయారట. పోయిన ఇంటి యజమాని తమ్ముడు నలుగురికీ అంత్యక్రియలు జరిపి ఈ ఇంటిని కేశవరావుకి అమ్మేసి కేష్ తీసుకుని వెళ్లిపోయాడట. జీవితం మీద, కట్టుకున్న ఇంటి మీదా మమకారం తీరని ఆ నాలుగు ప్రాణులూ ఈ ఇంటిని వదల్లేక ఇక్కడే మకాం పెట్టేశాయని చెప్పేడు."

"అయ్యో! వాళ్లింత దారుణంగా పోయారండీ. దురదృష్టవంతులు" జాలిగా అంది.

"సరే గాని ఈ విషయాలెక్కడా అనకు. ఈ కథ ప్రచారంలోకి వచ్చిందంటే మనం డెబ్భయి వేలకు నీళ్లొదులుకుని ఈ కొంపను మన దయ్యం మిత్రులకే వదిలేసి అద్దె ఇంటికి పోవాల్సొస్తుంది" హెచ్చరించాడు.

"అలాగేలెండి. అన్నట్టు టీ తెస్తానుండండి. బట్టలుక్కూడా సబ్బు పెట్టాను. ఉతికి ఆరబెట్టాలి" అంటూ ప్రజ్ఞ లోపలికెళ్ళింది.

సరిగ్గా అప్పుడే శ్రీహర్ష కొలీగ్ శ్యామలరావు ఆదరాబాదరాగా వచ్చాడు. "ఏమిటిలా వచ్చేవు?" అడిగాడు శ్రీహర్ష.

"హర్షా! శాంతికి నొప్పులొస్తుంటే ఇప్పుడే హాస్పిటల్లో ఎడ్మిట్ చేసి ఇలా వచ్చేను. శాంతి దగ్గర ఎవరూలేరు, మా అత్తగారు రేపు సాయంత్రానికిగ్గాని రారు. శ్రమ అనుకోకుండా చెల్లాయినోసారి సాయంగా పంపించవూ" అన్నాడు ప్రాధేయతగా.

"దానికింత బతిమాలాలా. పద మేమి



### రాజ్ కపూర్ భూతం?

రాజ్ కపూర్ స్టూడియోలోని ప్రముఖ రాజ్ కపూర్ కాటేజ్ లో రాజ్ కపూర్ దెయ్యమై నడుస్తూ, మాట్లాడుతూ, సంచరిస్తూ వుంటాడని రణధీర్ బట్టబయలు చేయడంతో ఆ స్టూడియోలో నైట్ షిఫ్టులు బంద్ అయ్యాయట. ఇలా చెప్పడం మానుకోమని ఈ జోకర్ సుపుత్రుడు జోకర్ కి ఎవరైనా చెప్తారా?

ద్దరం వస్తాం" అంటూ భార్యను పిల్చి విషయం చెప్పాడు.

ప్రజ్ఞ ఎక్కడి వక్కడే వదిలి ఇంటికి తాళాలు పెట్టి ఆ ఇద్దరి వెంట బయల్దేరింది.

మొదటి కాన్పు కావడం వల్ల శాంతికి డెలివరీ కావటానికి చాలా సమయం పట్టింది. ఎప్పుడో తెల్లవారు ఝామున నాలుగింటికి డెలివరీ వచ్చింది. బాబు పుట్టాడు. అప్పటివరకూ శ్యామలరావుకి, శాంతికి తోడుగా భార్యాభర్తలిరువురూ హాస్పిటల్లోనే ఉన్నారు.

తెలతెలవారుతుండగా "మళ్లీ పదింటికల్లా హాస్పిటల్‌కు వస్తామని" చెప్పి భార్యాభర్తలిరువురూ రిక్షాలో ఇంటికి బయల్దేరారు.

ఇంటితాళం తీస్తుండగా బట్టలు ఉతికి ఆరబెట్టాలన్న విషయం గుర్తొచ్చి ప్రజ్ఞకు నీరసం వచ్చింది.

"పోనీ ఓ గంట రెస్టు తీసుకుని ఆ తరువాత బట్టల పని చూడు. ఈ పూటకు హోటల్ నుండి కారియర్ తెచ్చుకుందాంలే" నిద్రలేమి వల్ల ఒడలిన పువ్వులా ఉన్న భార్యవైపు సానుభూతిగా చూస్తూ అన్నాడు.

తలుపులు తెరిచి వంటింటివైపు వెళ్లిన ప్రజ్ఞ షాక్ తిన్నట్టు నిలబడిపోయింది.

ఏం జరిగిందోనని వచ్చి చూసిన శ్రీహర్ష కూడా ఆమెలాగే తెల్లబోయాడు

సబ్బుపెట్టి వదిలేసి వెళ్లిన బట్టలన్నీ చక్కగా ఉతికి, నీటిలో ఝాడించి తాడు మీద అరబెట్టి ఉన్నాయి.

ముందుగా శ్రీహర్ష ఆ షాక్‌నుండి తేరుకుని "ఇది మన మిత్రుల పనే అయ్యుంటుంది" అన్నాడు.

"పాపం! మన కష్టసుఖాలను అవీ పంచుకోవాలని తహతహలాడుతున్నట్టున్నాయండీ. వాటి మంచితనాన్ని ఇలా ఉపయోగించుకున్నందుకు, వాటిని శ్రమపెట్టినందుకు నేను నిజంగా సిగ్గుపడుతున్నాను" అంది ప్రజ్ఞ నొచ్చుకుంటూ.

"పోనీలే. ఇంకెప్పుడూ శ్రమపడే అవకాశాన్ని మన మిత్రులకివ్వకుండా జాగ్రత్తపడదాం. ఇవన్నీ బయట ఎండలో ఆరబెడతాను. నువ్వు కాస్త కాఫీ కలిపి ఇవ్వు" అంటూ శ్రీహర్ష ఆ పనిలో పడ్డాడు.

* * * * * *

మూర్తి కథను చెప్పటం ఆపి గ్లాసులో మిగిలిన విస్కీని గొంతులో పోసుకున్నాడు.

కుతూహలంగా అతడు చెప్పేది వింటున్న



## కిమీ మోజు!

కిమి కాట్‌కర్ సినిమా రంగానికి గుడ్‌బై చెప్పాలని నిర్ణయం తీసుకుందట. ప్రొడ్యూసర్లు ప్రతిక్రి పోయారు. నిజానికి ఆమె నిర్ణయం విని ఎవరూ చింతించడంలేదు. సెట్స్‌కి ఆమెతో వచ్చే బంధుమిత్ర సపరివారానికి అంతం లేకుండా వుంది. ఆ ఆముదం అంతా ప్రొడ్యూసర్లకేగా!

ఇటీవల 'సుజానత్' సినిమాకై ప్రొడ్యూసర్ షషీరంజన్ కొన్ని షాట్స్ మహాబలేశ్వరం పంచాగ్నిలో తీయాల్సిరాగా కిమికి, ఆమె అమ్మ, అమ్మమ్మ, బాయ్‌ఫ్రెండ్‌ల వసతి కోసం ఏడు హోటల్‌రూములు బుక్ చేయాల్సి వచ్చింది.

ఆ సందర్భంలోనే కిమి షంతనూని పెళ్లాడబోతోందనే వదంతి వచ్చింది. పెళ్లంటూ జరిగితే ఆమె విచ్చలవిడితనానికి షంతనూ పగ్గాలు వేయాల్సిన అవసరం ఎంతైనా వుంది. లేకుంటే తట్టుకోవద్దూ మానవుడు!

మిత్రబృందం ఉత్కంఠనాపుకోలేక "ఆ తర్వాతేమయింది? శ్రీహర్ష ఆ ఇంటినెలా వదిలించుకున్నాడు? ఆ ఇంటిని అమ్మేసి మరో ఇల్లు కొనుక్కున్నాడా?" అడిగారు.

మూర్తి సన్నగా నవ్వుతూ "శ్రీహర్ష ఆ ఇల్లు అమ్మలేదు" చెప్పాడు.

"అంటే... ఇంకా ఆ దయ్యాల కొంపలోనే కాపురం ఉంటున్నాడా?" పద్మనాభం ఆశ్చర్యంగా అడిగాడు.

"ఆ! పదిహేనేళ్లుగా ఆ భార్యాభర్తలకు ఆ ఇంటితోను, ఇంట్లో ఉండే అజ్ఞాత మిత్రులతోను బంధం బలపడిపోయింది. ప్రజ్ఞ తన ఇద్దరు పిల్లలకు ఆ ఇంట్లోనే జన్మనిచ్చింది. పెద్దవాడికప్పుడే పన్నెండేళ్లొచ్చాయి" చెప్పాడు మూర్తి.

"బాప్‌రే! వాళ్ల గుండె ధైర్యానికి మెచ్చుకోవచ్చు" అన్నాడు సుబ్బారావు.

"నిజమే. దయ్యాలున్నాయని తెలిసీ మీరీ ఇల్లెందుకు అమ్మెయ్యలేదని" నేనడిగితే ఆ భార్యాభర్తలిద్దరూ ఏమన్నారో తెలుసా? "అవి చేసే శబ్దాలకు, వింత ధ్వనులకు మా ఇంట్లో వాళ్లందరం అలవాటు పడిపోయాం. వాటిని తల్చుకుంటే మాకు జాలేస్తుంది తప్ప భయం అనిపించదు. వాటి స్వేచ్ఛకు అవరోధం కల్పించే పనులేమీ చెయ్యము. మా మధ్య పరస్పరం చక్కటి అవగాహన ఏర్పడిపోయింది. వాటికి మా మీద అభిమానం ఏర్పడిందనడానికి అనేక దృష్టాంతాలు ఎదురయ్యాయి. వాటిల్లో చిన్న సంఘటన చెప్తే అవి మాకెంత మేలు చేశాయో మీకే అర్థమవుతుంది. ఓ రాత్రి బంధువులింట్లో పెళ్లికి ఉండిపోవాల్సొచ్చింది. ఇదే అదునుగా ఓ ఘరానా దొంగ తాళం బద్దలు కొట్టి ఇంట్లోకి దూరబడి ఖరీదయిన సామాన్లన్నీ మూటకట్టేశాడు. కాని ఏం జరిగిందో తెలియదుగాని అవి పట్టుకెళ్లే సాహసం మాత్రం చెయ్యలేకపోయాడు. జరిగింది లీలగా మేము ఊహించగలిగాం. మా మిత్రులు ఆ దొంగకు తగిన గుణపాఠం చెప్పే ఉంటారు. అప్పుడే మొదటిసారి వాటి మంచితనం మీద మాకు కృతజ్ఞత ఏర్పడిపోయింది. ఆ విధంగా మా బంధం మరింత గట్టిపడింది అని వాళ్లిద్దరు చెప్పినప్పుడు నాకు ఆ అజ్ఞాత శక్తులమీద చాలా సానుభూతి, ప్రేమ కలిగాయి" అని ముగించాడు మూర్తి.

"అయితే మూర్తీ ఆ ఊరు మనం ఓసారి వెళ్లితీరాలి. ఆ దంపతుల్ని అభినందించాలి. ఆ ఇంట్లో తిరిగే మిత్రుల సందడి మనం స్వయంగా చూసి తెలుసుకోవాలి" అన్నాడు పద్మనాభం ఉత్సాహంగా.

"ఉద్దేశ్యం మంచిదే. ఆ ఇంట్లో గడపగలిగే గుండె నిబ్బరం నీకుందో లేదో ముందుగా పరీక్షించాలి" అన్న మూర్తి మాటలకు అందరూ ఘొల్లున నవ్వారు.

○